www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 28 జులై 2025
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

కోటిపల్లి వద్ద వరద ప్రవాహం

ప్రజాశక్తి - రామచంద్రపురం

గోదావరి నదికి వరదనీటి ప్రవాహం ఉధృతంగా కొనసాగుతోంది. భారీ వర్షాలకు వరద నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ఇప్పటికే పలు లంక ప్రాంతాలు నీట మునిగాయి. లంకల్లో కూరగాయల పంటలు నీట మునిగాయి. ప్రవాహ వేగం ఉధృతంగా ఉండడంతో కోటిపల్లి రేవులో పడవలు, పంట్లు, ఒడ్డుకు చేరుకున్నాయి. గత వారం రోజులుగా వరద నీటి ప్రవాహం పెరగడంతో పడవ ప్రయాణాలను రెవెన్యూ అధికారులు రద్దు చేశారు. లంకల్లోని పశువులను ,మేకలను, ఏటి గట్టుకు తరలించాలని రైతులకు ఆదేశాలు ఇచ్చారు. బలహీన ఏటిగట్లను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా రెవెన్యూ శాఖ పనిచేస్తుంది.


ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

పి-4 సర్వేతో ప్రజల్లో ఆందోళన

- జిల్లాలో 56.89 శాతం సర్వే పూర్తి
- 64 వేల బంగారు కుటుంబాలుగా గుర్తింపు
- 30 వేల మంది మార్గదర్శకుల కోసం వెతుకులాట
- సంపాదనపరులు జాబితాలో వ్యవసాయ కూలీలు, పింఛనుదారులు
- వ్యక్తిగత వివరాలూ సేకరిస్తున్న సిబ్బంది

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పి-4 సర్వేతో ప్రజానీకంలో ఆందోళన వ్యక్తమవుతోంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి స్థితిగతులు మెరుగుపరిచే ఈ సర్వే కొనసాగనుంది. దీనిలో భాగంగా సర్వే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల వివరాలు సేకరిస్తున్నారు. అయితే, సర్వే సిబ్బంది తీసుకుంటున్న వివరాల్లో ఎక్కువ భాగం ఆదాయానికి సంబంధించిన ప్రశ్నలే ఉండటంతో సంక్షేమ పథకాలపై కోత పడుతుందన్న ఆందోళన ప్రజల్లో ఉంది.

ప్రజాశక్తి-రాజోలు

పి -4 పథకం కింద జిల్లాలో 64 వేల కుటుంబాలను ఎంపిక చేశారు. వీరిని ఆదుకొనే విధంగా పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, విదేశాల్లో నివాసం ఉంటున్న వారిని ఎంపిక చేయడానికి కసరత్తు జరుగుతోంది. సమాజంలో అత్యధికంగా స్థిరపడిన 10 శాతం మంది తమ జన్మభూమిలో నిరుపేదలైన 20 శాతం మందికి చేయూతనిచ్చే విధంగా ప్రభుత్వం ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసింది. జిల్లాలో 15 లక్షల కుటుంబాలను సర్వే నిర్వహించారు. ఒప్పటికే జిల్లాలో 64 వేల కుటుంబాలను గుర్తించారు. ఎంపిక చేసిన కుటుంబాలలో పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం, ఉద్యోగ, ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణ ఇప్పించడం, నివాస ప్రాంతాల్లో, ఇంటి అవసరాలకు వీలుగా మౌలిక వసతులు కల్పించడం, ఆదాయ పరంగా నిలదొక్కుకునేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

సర్వే యొక్క ముఖ్య ఉద్దేశ్యం

స్వర్ణ ఆంధ్ర మిషన్‌లో భాగంగా పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 20శాతం మంది వివరాలు సేకరించడానికి ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల శాఖ సహకారంతో ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు, సచివాలయాల సిబ్బంది సర్వేలో భాగస్వాములు అవుతున్నట్లు తెలిపింది. సర్వే సమయంలో సంబంధిత ఇళ్ల వారు లేకపోతే, సిబ్బంది మళ్లీ వెళ్లి వివరాలను తప్పనిసరిగా సేకరించాలని. ఒక వేళ ఇతర ప్రాంతాలకు వలస వెడితే ఆ వివరాలను కూడా నమోదు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది.

18 నియమ నిబంధనలు, 1 శాతం ఆదాయం ఉన్నా అనర్హులే

మొత్తం 18 ప్రశ్నలకు సమాధానాలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. కుటుంబంలో ఎంత మంది సంపాదిస్తున్న వారు ఉన్నారు? ఇంట్లో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం కలిగి ఉన్నారా? సొంతంగా ఎవరైనా వ్యాపారం చేస్తున్నారా? ఐటీ రిటర్న్ దాఖలు చేశారా? ఇంట్లో ఎవరికైనా బ్యాంకు ఖాతా ఉందా? పట్టణ లేదా మునిసిపాలిటీ పరిధిలో ఆస్తులు ఏమైనా ఉన్నాయా? కుటుంబ యజమాని ఆధార్ నెంబర్ నమోదు చేయాల్సి ఉంటుంది. ఆయా కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లు కచ్చా ఇళ్లా లేక పక్కా ఇల్లా అనేది యాప్‌లో నమోదు తప్పనిసరి. వీటితో పాటు వాణిజ్యేతర (నాన్ కమర్షియల్) 4 వీలర్ లేదా 2 వీలర్ (కుటుంబ జీవనోపాధికి ఉపయోగించని వాహనం) ఉంటే ఆ వాహనం వివరాలు నమోదుతో పాటు వ్యక్తిగతంగా ఉపయోగించే కార్లు, బైక్‌లు వాణిజ్యేతర వాహనంగా పరిగణిస్తారు. కుటుంబ సభ్యుల విద్యుత్ వినియోగం, ఇంట్లో టివి, ఫ్రిజ్, ఏసి ఉన్నట్లయితే వాటి వివరాలు కూడా సర్వే యాప్‌లో నమోదు చేయడం తప్పనిసరి. ఆదాయం ఏమాత్రం ఉన్నా కూడా సంపాదనపరులుగా నమోదు చేయాలని సిబ్బందికిచ్చిన మార్గదర్శకాల్లో ప్రభుత్వం పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.

ఇవీ అనుమానాలు

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారి వివరాల కన్నా ఇతర వివరాలు సేకరించడంపైనే ప్రభుత్వ దృష్టి ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆస్తులు, ఆదాయపన్ను చెల్లింపు వంటి వివరాలను అడగుతుండటమే దీనికి కారణం. పేదరికాన్ని చిహ్నాలైన చదువును మధ్యలోనే మానివేయడం, బాలకార్మికులు, ఆహార కొరత, పౌష్టికాహార లోపం, రక్తహీనతతో పాటు ఇతర అనారోగ్యాల వంటి అంశాలకు సంబంధించిన ప్రశ్నలు ఈ సర్వేలో లేదు.

రాజోలులో పి-4 సర్వే

సంక్షేమ పథకాల్లో కోత ఉండదు

ఇప్పటికే జిల్లాలో 64 వేల బంగారు కుటుంబాలను గుర్తించాము. బంగారు కుటుంబాలకు అండగా నిలిచే మార్గదర్శుల వివరాల నమోదుపై యంత్రాంగం దృష్టి పెట్టింది. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో ఈ తరహా వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో ఐదుగురు సిబ్బంది ఉన్నారు. సచివాలయాల్లోని ప్లానింగ్ సెక్రటరీలు డిప్యుటేషన్‌పై సేవలందిస్తున్నారు. అర్బన్ పరిధిలో మార్గదర్శులు ఎక్కువ మంది ఉన్నారు.వారిని ముందు కొచ్చేలా కలెక్టర్,సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.పి 4 ,సర్వే వల్ల సంక్షేమ పథకాలలో కోత ఉండదు. పి4 పథకంపై ప్రజల్లో అపోహలు తొలగాలి. **-జి.మురళీ, సిపిఒ ,పి4 ప్రాజెక్ట్,అంబేద్కర్ కోనసీమ జిల్లా**

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తిప్పికొట్టాలి

సిపిఎం పిలుపు

ప్రజాశక్తి - కాట్రేనికోన

ప్రజల సంపదను అదానీలకు దోచిపెట్టందుకు ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లను ప్రజలు ఎక్కడికి అక్కడ తిప్పికొట్టాలని సిపిఎం పిలుపునిచ్చింది. కాట్రేనికోన మండల పరిధిలోని దొంతుకుర్రు గ్రామంలో ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన స్మార్ట్ మీటర్ల వ్యతిరేక ప్రచార ఉద్యమానికి నాయకులు శ్రీకారం చుట్టారు. ఈ ప్రచారంలో సిపిఎం మండల కార్యదర్శి విత్తనాల రాంబాబు పాల్గొని మాట్లాడుతూ స్మార్ట్ మీటర్‌ను సెల్‌ఫోన్ పద్ధతిలో ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జి చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. ఇప్పటివరకు ఇంటికి వచ్చి రీడింగ్ తీసే పద్ధతి ఉండదని, బిల్లు ఉండదని దీని ద్వారా ప్రజల సొమ్ము దోపిడీ చేయడమే ఈ స్మార్ట్ మీటర్ల ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. డిమాండ్ ను బట్టి పగలు ఒక రేటు, రాత్రి ఒక రేటు, చలికాలం ఒకరేటు, వేసవికాలం మరొక రేటు, ఎప్పుడు పడితే అప్పుడు రేట్లు పెంచే అవకాశం ఉంటుందన్నారు. గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగిస్తే వతిరేకించిన టిడిపి నేడు అదే స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజలపై భారాలను మోపుతోందని విమర్శించారు. గతంలో స్మార్ట్ మీటర్లును పగలగొట్టాలని చెప్పిన టిడిపి నేతలు నేడు మీటర్లు బిగించాలని ఆదేశాలు ఇవ్వడం ప్రజలను వంచన చేయడమేనన్నారు. ప్రజలంతా స్మార్ట్ మీటర్లను అడ్డుకుని, వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సత్తిబాబు, వెంకటలక్ష్మి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై వ్యతిరేక ప్రచారంలో సిపిఎం నాయకులు

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు ఈ నెల 28న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా అర్జీ దారుల వినతులను స్వీకరిస్తామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం (పి జిఆర్ఎస్) ద్వారా అర్జీల స్వీకరణ ప్రక్రియ చేపట్టనున్నట్టు తెలిపారు. స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు మూడు రెవెన్యూ డివిజన్ ప్రధాన కేంద్రాలలోను 4 మునిసిపల్ ప్రధాన కార్యాలయాల లోనూ 22 మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందు బాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసు కోవాలని కలెక్టర్ తెలిపారు. అదేవి ధంగా అర్జీదారులు తమ అర్జీలను పిజిఆర్ఎస్ వెబ్‌సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల పరిష్కార స్థితిగతు లు సంబంధిత సమాచారం తెలుసుకు నేందుకు 1100 కి నేరుగా ఫోన్ చేసి సంప్రదిం చవచ్చునని తెలిపారు. అర్జీదారులు జిల్లా, డివిజన్, మండల నిర్దేశిత స్థాయిలలోనీ ప్రజా సమస్యల పరిష్కార వేదికలను ఆశ్రయించి తమ తమ సమస్యలకు తగు పరిష్కార మార్గాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తూర్పు గోదావరి జిల్లాలో మండపేట విలీనానికి కృషి

ప్రజాశక్తి - మండపేట

మండపేట ప్రజల ఆకాంక్ష మేరకు మండపేటను రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేసేందుకు కృషి చేస్తానని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మెన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. మండపేట లయన్స్ క్లబ్ కళ్యాణ మండపం లో ఆదివారం జెఎసి ఛైర్మన్ కామన ప్రభాకరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎల్ఎ వేగుళ్ల మాట్లాడుతూ మండపేట టౌన్, మండలం విలీనం చేసేందుకు ఇక్కడి ప్రజలు వంద శాతం సుముఖంగా ఉన్నార న్నారు. కాగా కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లో లోగడ విభిన్న అభిప్రాయాలు ఉన్నాయన్నారు. ఆ రెండు మండలాలకు సంబంధించి మెజార్టీ ప్రజల కోరుకునే విధానం లో పనిచేస్తానని స్పష్టం చేశారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ తీర్మానాలు ఇవ్వాలన్నారు. దీని ప్రకారం ముందుకు వెళతామని పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

ప్రజాశక్తి - ఆలమూరు

కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసిపి నాయకులు విమర్శలు చేస్తున్నారని మండల టిడిపి అధ్యకుడు ఈదల సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి సలాది నాగేశ్వరరావుతదితర నాయకులు దుయ్యబట్టారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారంతా మాట్లాడారు. ఈ నెల26న స్థానిక వినాయక కన్వెన్షన్ లో వైసిపి జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి బాబు ష్యూరిటీ సభ పెట్టి అబద్ధాలతో ప్రజలను మభ్య పెట్టాలని చూశారని విమర్శించారు. తమ నాయకుడు బండారుని విమర్శిస్తే తాము ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి తోటను సన్మానించిన వైసిపి కార్యకర్తలు

ఎంఎల్‌సి తోటకు పలువురి అభినందన

ప్రజాశక్తి - మండపేట

రాష్ట్ర సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ ఛైర్మన్‌గా ఎంపికైన మండపేట వైసిపి ఇన్‌ఛార్జి, ఎంఎల్‌సి తోట త్రిమూర్తులకు ఆదివారం మండపేటలోని పార్టీ కార్యాలయ ంలో కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు. శాసనసభ కమిటీలలో అత్యంత కీలకమైన సబార్డినేట్ కమిటీ ఛైర్మన్ గా ఆయన నియమించడంపై పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తచేశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మెండు బాపిరాజు, మారిశెట్టి సత్యనారాయణ, ఎర్రగుంట అయ్యప్ప, పట్టణ మాజీ అధ్యక్షులు ముమ్మిడివరపు బాపిరాజు, జిల్లా ఫుడ్ కమిటీ మాజీ సభ్యులు పేపర్తి సాంబు, మీగడ శ్రీనివాస్, సూరంపూడి సత్యప్రసాద్, జిన్నూరు సత్యసాయిబాబా, పెంకే గంగాధరం తదితరులు,పాల్గొన్నారు. మండపేట వైసిపి కార్యాలయంలో ఆదివారం ఎంఎల్‌సి తోట త్రిమూర్తులును అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి ముగ్గళ్ల గణేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక విజయలక్ష్మీ నగర్‌లో వైసిపి కార్యాలయంలో శాసన సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ ఛైర్మెన్‌గా నియమితులైన సందర్భంగా ఆయనను కలిసి అభినందనలుతెలిపి ఘనంగా సత్కరించారు.

కార్టూ'నిజం'



19 నెలలుగా అందని గౌరవ వేతనం

ఎంపిటిసి సభ్యులు, ఎంపిపిలకూ అదే పరిస్థితి

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండల ప్రజా పరిషత్ కు ఎన్నికైన ప్రాదేశిక సభ్యులకు గత 19 నెలలుగా గౌరవ వేతనం అందకపోవడంతో సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిషత్ కు ఎంపికైన ఎంపిటిసి సభ్యులకు ప్రభుత్వం గౌరవ వేతనం నెలకు రూ.3 వేలు, మండల పరిషత్ అధ్యక్షులకు రూ.6 వేలు గౌరవ వేతనం అందజేస్తుంది. గత ఏడాది జనవరి 2024 నుంచి ఇప్పటివరకు గౌరవ వేతనం అందడం లేదని ఎంపిటిసి సభ్యులు పలుమార్లు మండల పరిషత్ అధికారులకు తెలియజేశారు. 19 నెలలుగా ఈ తతంగం కొనసాగుతుంది. మామ మాత్రమే చెల్లించే రూ.3000 కూడా ఎంపిటిసి సభ్యులకు అందకపోవడంతో వారు నిరుత్సాహపడుతున్నారు. వీరితోపాటు ఎంపిపిలకు నామ మాత్రంగా చెల్లించే రూ.6000 కూడా 19 నెలలుగా అందలేదు. రామచంద్రపురం మండలంలో 20 మంది ఎంపిటిసి సభ్యులు ఉండగా, కె.గంగవరం మండలంలో 19 ఎంపిటిసి సభ్యులు ఉన్నారు. వీరంతా ఏడాదిన్నరగా గౌరవ వేతనం కోసం ఎదురుచూస్తున్నారు. నామ మాత్రం చెల్లించే ఈ వేతనం కూడా అందకపోవడంతో వారంతా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. నామమాత్రపు అధికారంలో ఉన్న ఎంపిటిసి సభ్యులకు గౌరవ వేతనం కూడా నామమాత్రంగానే ఉందని అది కూడా సక్రమంగా చెల్లించకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎంపిటిలకు రావలసిన గౌరవ వేతనాన్ని చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

మండల పరిషత్ కార్యాలయం రామచంద్రపురం

గౌరవ వేతనం విడుదల చేయాలి

ఏడాదిన్నరగా ఎంపిటిసిలకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం ప్రభుత్వం విడుదల చేయడం లేదు నామాత్రంగా చెల్లించే ఈ వేతనాలు వెంటనే విడుదల చేయాలి. దీని పై అధికారులకు కూడా విజ్ఞప్తి చేశాము. ఎంపిపిలకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం కూడా విడుదల కాలేదు.
-ఎంపిపి అంబటి భవాని, రామచంద్రపురం

నిధులు విడుదల కావాల్సి ఉంది

ఎంపిటిసి సభ్యులకు 19 నెలలుగా అందాల్సి గౌరవ వేతనానికి సంబంధించిన బిల్లులు ప్రవేశపెట్టము. అయితే నిధులు విడుదల కాలేదు. ఎంపిటిసిలకు, ఎంపిపి లకు సంబంధించిన బిల్లులు తమ కార్యాలయం నుండి పంపించామని నిధులు విడుదల కావలసి ఉంది.
- పద్మజ్యోతి, ఎంపిడిఒ, రామచంద్రపురం

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

రౌడీయిజం, అల్లర్లు, అసాంఘిక కార్యకలాపాలు వంటి వాటికి ఎవరైనా పాల్పడినట్లయితే కఠిన చర్యలు తప్పవని డిఎస్‌పి సుంకర మురళీమోహన్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని స్టేషన్ వద్ద రౌడీ షీటర్లకు ప్రత్యేక అవగాహనా సదస్సు సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఎస్ఐ జి.నరేష్ తో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో పలువురిపై రౌడీ షీట్ నమోదు చేయబడి ఉన్నాయన్నారు. వారందరినీ స్టేషన్‌కి పిలిపించి చట్టం యొక్క నిబంధనలు, వాటి విధివిధానాలను వివరించామన్నారు చట్ట పరిధిలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని వ్యతిరేకించే వారిపై చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. సామాన్య ప్రజలను రెచ్చగొట్టే ధోరణికి గాని, వారిని ఇబ్బందులకు గురి చేసే విధానాలను అవలంబించితే అలాంటి వారిని గుర్తించి రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. పతి ఒక్కరూ మంచి ప్రవర్తనతో ఎటువంటి మత్తుమందులకు బానిస కాకుండా వాటికి దూరంగా ఉంటూ, ముఖ్యంగా యువత సక్రమమైన జీవితాన్ని ఆచరించాలని వారు సూచించారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డిఎస్‌పి మురళీమోహన్

మోదుకూరు సొసైటీ ఛైర్మన్ వీర్రాజు చౌదరికి అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు

మోదుకూరు సొసైటీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఈదల వీర్రాజు చౌదరిని ఆయన నివాసమైన గుమ్మిలేరు లో ఆదివారం స్థానిక బిసి సంఘ యువత కలిసి అభినందించి, సత్కరించారు. అలాగే ఛైర్మన్ వీర్రాజు హయాంలో సొసైటీ ద్వారా రైతులకు మరిన్ని ఉత్తమ సేవలు అందించి, అభివృద్ధి పథంలో నడిపించాలని వారంతా ఆకాంక్షించారు. వీర్రాజు మాట్లాడుతూ రైతులు అందరూ నిరాటంకంగా తమ సాగును కొనసాగించాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దష్టికి తీసుకురావాలని ఆయన రైతుకుల విజ్ఞప్తిచేశారు.

వీర్రాజు చౌదరి అభినందిస్తున్న బిసి యువత

పల్లంకుర్రులో రావిచెట్టు వద్ద కుంగిన రహదారి

కుంగిన రహదారి .. నిధులు పక్కదారి ?

ప్రజాశక్తి - కాట్రేనికోన

రూ.కోట్లు ప్రభుత్వ నిధులు పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు అధికారుల పర్యవేక్షణా లోపంతో, గుత్తేదారుల నాసిరకం పనులతో పేకమేడల్లా కూలిపోతున్నాయి. తాజాగా మండల పరిధిలోని పల్లంకూరు రావిచెట్టు ప్రాంతంలో నాసిరకం పనులతో నిర్మించిన కాలువలకు రక్షణ గోడల వద్ద అక్రమార్కులు మట్టిని తరలించుకుపోవడంతో రహదారి కుంగిపోయింది. కూటమి ప్రభుత్వం ఇటీవల కాలువల ఆధునికీకరణ కోసం రూ.కోట్లను విడుదల చేసింది. ఈ నిధులతో మండల పరిధిలో అనేక కాలువల ఆధునికీకరణ పనులను ఒక గుత్తేదారుడు చేపట్టాడు. అయితే పనులు మొదటి నుంచీ నాసిరకంగా జరుగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తినా సదరు గుత్తేదారుడు అధికారులకు భారీగా ముడుపులు ఇచ్చి తన పనులను సక్రమంగా చూపించుకున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాలువలకు నీరు వస్తే తమ అవినీతి బయటపడదు అనే ధైర్యంతో కాంట్రాక్టరు, అధికారులు కుమ్మక్కై ప్రజల సొమ్మును అందినకాడికి దోచుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వరదల సమయంలో అత్యంత ప్రమాదకరమైన ప్రదేశంగా గుర్తించిన బూలావారిమొండి వద్ద కాలువకు రక్షణగా నిర్మించిన గోడ పక్కన ఉన్న రహదారి సుమారు పది మీటర్ల పొడవున కుంగిపోయింది. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపి, దోషులపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అధికారి వివరణ..

పల్లం కూరు -2 పరిధిలోని బులవారి పేట రావి చెట్టు ప్రాంతంలో నూతనంగా రెగ్యులేటర్‌ను నిర్మించడం జరిగింది.అయితే పనులు చేస్తున్నప్పుడు వర్షాలు రావడం వలన నిర్మాణం ఆలస్యమైందన్నారు. తరువాత జూన్‌లో నిర్మాణ పనులు చేపట్టేందుకు వాతావరణం అనుకూలించినప్పటికీ కాలువలకు సాగునీరు విడుదల చేయడంతో పనులకు అంతరాయం ఏర్పడింది. దీంతో రహదారి కంగిన మాట వాస్తవమేనని త్వరలోనే సాగునీరును నిలుపుదల చేసి వింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టి రహదారిని పునర్నిర్మిస్తామని ఇరిగేషన్ శాఖ అధికారి పవన్ తెలిపారు.

కేశవరం వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ తేజో ఫణీంద్ర

చిన్న వయసులోనే వెన్నెముక వంకర్లు గుర్తించాలి

ప్రజాశక్తి - మండపేట

వెన్నెముక వంకర్లు చిన్న వయస్సులోనే గుర్తించడం ద్వారా నిపుణులైన వైద్యులను కలిసి సరిచేసుకోవచ్చునని రాజమహేంద్రవరం ఆసుపత్రి ప్రముఖ వెన్నెముక నిపుణులు డాక్టర్ తేజో ఫణీంద్ర అన్నారు. ఆదివారం మండపేట మండలం కేశవరం శ్రీ సరస్వతి ఇంగ్లీషు మీడియం పాఠశాల వద్ద గ్రామ సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని సర్పంచ్ సత్యనారాయణ మూర్తి ప్రారంభించారు. ఈ శిబిరంలో ఫణీంద్ర మాట్లాడుతూ 50 సంవత్సరాలు వయస్సు దాటిన వారిలో ఎముక గుల్ల బారి కింద పడిపోతే చాలు ఎముకలు విరిగిపోయి కట్లు వేయించుకొనే పరిస్థితి వస్తుందన్నారు. రెండు అంతస్తుల బిల్డింగ్ మీద నుంచి పడిపోతే విరగవలసిన ఎముక, నిలబడిన వ్యక్తి కింద పడిపోతే చాలు ఎముక విరిపోయే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఎముక సాంద్రత పరీక్షలు చేయించుకుని మందులు తగినవి వాడుకోవడం ద్వారా ఎముక గుల్ల బారడాన్ని పోగొట్టుకోవచ్చున్నారు. ఈ వైద్య శిబిరంలో రాజమహేంద్రవరం వేద హాస్పిటల్స్ వెన్నెముక నిపుణులు డాక్టర్ తేజో ఫణీంద్ర, గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ మృదులలు 148 మందికి వైద్య సేవలు అందించారు. ఉచిత మందుల విభాగాన్ని పెదపాటి సీతారామ్, గ్రామపెద్ద పెదపాటి ఉమా మహేశ్వరరావు, బిఎండి మెషిన్‌ను ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరము లో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సరస్వతి ఇంగ్లీషు మీడియం పాఠశాల స్టాఫ్ , వేద హాస్పిటల్స్ స్టాఫ్ వైద్య సేవలు అందించారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

కూటమి పాలనలో అభివృద్ధి వేగవంతం

ప్రజాశక్తి - ఆలమూరు

కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. సంధిపూడి లో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆదివారం ఆయన కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు. స్థానిక రైతులు విద్యుత్ సమస్యలపై ట్రాన్స్‌ఫార్మర్ కొరకు అభ్యర్థించగా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనలోని ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

31లోగా హజ్‌యాత్రకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

హజ్ యాత్రకు వెళ్లే వారు ఈనెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యులు ముఖరమ్ హుస్సేన్ తెలిపారు. మామిడికుదురులో సున్నీ జామియా, షియా జామియా మసీదు ప్రతినిధులకు ఆదివారం హజ్ యాత్ర దరఖాస్తులు అందజేశారు. 2026 డిసెంబర్ 31 వరకు చెల్లుబాటు అయ్యే మెషన్ రీడబుల్ పాస్‌పోర్టు ఉండాలన్నారు. ఎంపికైన హజ్ యాత్రకులు ముందస్తుగా రూ.1,52,300 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, మసీదు కమిటీ అధ్యక్షులు మసూద్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

ఆదుర్రులో బౌద్ధారామం పర్యాటకానికి అనుకూలం

ప్రజాశక్తి - మామిడికుదురు

వైనతేయ గోదావరి తీరాన్న అందమైన మడ అడవులు కలిగివున్న ఆదుర్రులో బౌద్ధారామం పర్యాటకం అభివృద్ధికి అనుకూలమని ఐఅండ్‌పిఆర్ జాయింట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ తెలిపారు ఆదుర్రు లో ప్రాచీన బౌద్ధ స్థూపాన్ని ఆదివారం ఆయన సందర్శించి అక్కడ కట్టడాలు పరిశీలించారు ఈ స్తూపము క్రీస్తుపూర్వం రెండవ శతాబ్దం లో అశోక చక్రవర్తి కుమార్తె సంఘమిత్ర చే నిర్మాణం చేసినట్లు చరిత్ర ఆధారాలను బట్టి తెలుస్తోందన్నారు. ఆదుర్రు బౌద్ధ స్తూపానికి సరైన రోడ్డు మార్గం లేక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. పర్యాటక శాఖ గతంలో నిర్మించిన బోటు పాయింట్ వినియోగం లేక శిథిల సితికి చేరుకుందన్నారు. బోటు పాయింట్ నుంచి బౌద్ధ స్తూపానికి వెళ్లే కరకట్ట రహదారి వినియోగం లేక అడవితుమ్మ చెట్లతో మూసుకుపోయిందని స్థానికులు ఆయన దష్టికి తీసుకువెళ్లారు 216వ జాతీయ రహదారి పాశర్లపూడి బ్రిడ్జి బోట్ పాయింట్ నుంచి ఆదుర్రు బోట్ పాయింట్ వరకు బోట్ షికారు ఏర్పాటు చేస్తే పర్యాటకులు ఈ ప్రాంత అందాలు ఆస్వాదించవచ్చున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై దృష్టి సారించి అభివృద్ధి చేస్తే ఏకో టూరిజంగా అభివద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట సర్పంచ్ బల్ల శ్రీనివాసరావు, నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పినిశెట్టి రామచంద్రశేఖర్, చెల్లుబోయిన శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు

ఆదుర్రు బౌద్ధ స్తూపాన్ని పరిశీలిస్తున్న జెడి కిరణ్‌కుమార్

జిల్లాలో ముమ్మరంగా వరినాట్లు

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్.మాధవరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలోని రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. తాజాగా వర్షాలు కురిసిన నేపథ్యంలో కోరుకొండ, గోకవరం మండలాల్లోనూ ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు. ఈ దశలో నీటి వనరులు, ఎరువుల లభ్యత తదితర విషయాలపై రైతుల్లో కలవరం మొదలైంది. మరోవైపు సేంద్రియ వ్యవసాయం ప్రోత్సాహం పేరుతో ఎరువుల కేటాయింపు కుదించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో యూరియా కొరత నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని సాగు సంబంధింత విషయాలు, ఎరువుల లభ్యతపై రైతులకు అవగాహన కల్పించేందుకు 'ప్రజాశక్తి' వ్యవశాయ శాఖ జిల్లా అధికారి ఎస్.మాధవరావును పలకరించింది. ఈ సందర్భంగా వెల్లడించిన ఆయన మాటల్లోనే...

జిల్లాలో నాట్లు ఎన్ని ఎకరాల్లో ప్రారంభం అయ్యాయి. ఖరీఫ్ సాగు ఎంత విస్తీర్ణంలో జరుగుతుందని అంచనా వేస్తున్నారు..?

జిల్లాలో ఖరీఫ్ సాగు 1.85 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా వేస్తున్నాం. దాదాపుగా అన్ని మండలాల్లో సాగు ప్రారంభమైంది. 1.47 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. కొన్ని మండలాల్లో ఖరీఫ్ పంట ఆలస్యంగా కోతలు పూర్తయ్యాయి. ఆయా ప్రాంతాల్లో సాగు కొంత ఆలస్యంగా ప్రారంభించారు. ఈ నెలాఖరునాటికి 90 శాతం నాట్లు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. ఖరీఫ్ సాగు ప్రారంభం నేపథ్యంలో రైతులకు కావల్సిన ఎరువులు అందుబాటులో ఉంచాము.

జిల్లాలో యూరియా కొరత ఉందని అంటున్నారు.. నిజమేనా..? అన్ని రకాల రసాయన ఎరువుల డిమాండ్ ఎంత ఉంది..? లభ్యత ఎంత ఉంది..?

యూరియా కొరత లేదు. రబీ సాగుకు సంబంధించి రెండు నెలల ముందుగానే కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేశాము. రైతులకు కావల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాము. మొత్తం రబీ సాగుకు దశల వారీగా సుమారు 20 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం ఉంటుంది. తొలి దశ అవసరాలకు తగ్గట్లుగా ఎరువులను అందుబాటులో ఉంచాము. యూరియా, డిఎపి, కాంప్లెక్స్ ఎరువులు, ఎంఒపి ఉన్నాయి.

ముందస్తు వ్యవసాయ సాగు ప్రణాళికల ద్వారా రైతులకు ఎలాంటి ప్రయోజనం లభించింది..?

రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతేడాది ఖరీఫ్‌లో ముందస్తు వ్యవసాయ ప్రణాళికలను రూపొందించాము. మంచి ఫలితాలు వచ్చాయి. గోదావరి వరదలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయే పరిస్థితుల నుంచి కొంత ఊరట లభించింది. తాజా సాగు కూడా నెల రోజులు ముందుగానే ప్రారంభమైంది. మెట్ట ప్రాంతాలో సాగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాము.

మెట్ట ప్రాంతంలో సాగును ప్రోత్సహించేందుకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు..?

జిల్లాలో 15,265 వ్యవసాయ బోర్లు ఉన్నాయి. వాటిలో 8,455 బోర్ల ద్వారా ఉద్యాన పంటలకు సాగు నీరు అందిస్తుండగా మిగిలిన 6,810 బోర్లు మెట్ట ప్రాంతంలోనే ఉన్నాయి. రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, రంగంపేట, బిక్కవోలు తదితర మండలాల్లో నాట్లు పూర్తయ్యాయి. మెట్ట ప్రాంతంలో 1.40 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా వేస్తున్నాము. వీటిలో గొట్టపు బావుల సాయంతో 50 వేల ఎకరాల్లో సాగు చేస్తారు. రబీలో ఎక్కువగా ఆర్ఎన్ఆర్ 15048 వరి వంగడాన్ని సాగు చేస్తున్నారు. దీనికి తెగుళ్ల బెడద తక్కువ, మంచి దిగుబడి ఇస్తుంది. ఈ పంట తర్వాత మూడో పంటగా అపరాలు, జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట సాగు చేయటానికి ఈ ముందస్తు సాగు ఉపయోగగపడుతుంది.

ప్రతి ఏటా సాగుకు చివరి దశలో నీటి కొరత తలెత్తుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు నీటి పారుదల శాఖతో ఎలా సమన్వయం చేసుకోనున్నారు..?

జిల్లా కలెక్టర్ ఆధ్వర్యాన వ్యవసాయ శాఖతో పాటు ఇతర సాగు సంబంధిత శాఖలతో సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించి నీటి పంపిణీపై చర్చించారు. ఈ ఏడాది సాగునీటికి ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని 71 వేల ఎకరాల్లో ఆయకట్టుకు సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించారు. ప్రతి సెంటుకూ నీరు అందించే లక్ష్యంతో క్రాస్‌బండ్‌లు, ఆయిల్ ఇంజిన్ల వంటి ప్రత్యామ్నాయ మార్గాలపైనా దృష్టి పెడుతున్నారు. కావున సాగునీటి కొరత ఇబ్బందులుండవు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్ అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఒక వ్యక్తి మృతికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాలు ఇవి.. ఈనెల 22న రాత్రి 11:45 గంటల సమయంలో జగన్నాయకులపాలెం గ్రామం శివారున సాయి వెంకట్ ఫర్నేచర్ షాప్ ఎదురుగా మెయిన్ రోడ్డు వద్ద రామచంద్రాపురం నుంచి ద్రాక్షరామం వైపు గుర్తు తెలియని కారు వెళ్లింది. ఆ సమయంలోకారు ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌పై వెళుతున్న వనుము కష్ణని ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ ఎస్ఐ.లక్ష్మణ్ కేసు నమోదు చేశారు. ప్రమాదంలో జరిగిన ప్రదేశంల పడి వున్న కారు ఎడమ వైపు సైడ్ మిర్రర్ ఆధారంగా, కెమెరాలను పరిశీలించారు. దీని అధారంగా 26న మండపేటలోని దుర్గా మల్లేశ్వరి మెకానిక్ షాప్ షెడ్‌లో కారుని గుర్తించి సీజ్ చేశారు. ఆదివారం సాయంత్రం అందిన సమాచారం ప్రకారం ఈ కేసులో కారు డ్రైవరు రామచంద్రపురానికి చెందిన దామిశెట్టి వెంకట వీర వర్షిత్,ను జగన్నాయకులపాలెం గ్రామ పెట్రోల్ బంక్ దాటిన తరువాత గున్నాయితూము వద్ద అరెస్ట చేసినట్లు ద్రాక్షారామం ఎస్ఐ వివరించారు.

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆలమూరు మండల కేంద్రంలోని సంత మార్కెట్ వద్ద పేకాడుతున్న సమాచారంతో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో అయిదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.13,310 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జి.నరేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

జగ్గంపేట మండలంలోని కాట్రావులపల్లి గ్రామ శివారు గరువు చెరువు ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడిలో రూ.5,150 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈదాడిలో ఎస్ఐ రాఘునాథరావు, సిబ్బంది పాల్గొన్నారని, వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా జగ్గంపేట శివారు స్మశాన వాటిక వద్ద మైనర్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద 8 లిక్కర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

కరప మండలంలోని వేములవాడ గ్రామ శివారులో ఆదివారం నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురుని అరెస్టు చేశామని ఎస్ఐ టి.సునీత తెలిపారు. వారి నుంచి రూ.3240 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు.

సీతానగరం కాటవరం శివారులో పేకాడుతున్న పేకాడుతున్న ముగ్గురిని సీతానగరం పోలీసులు అరెస్టు చేశారు. కాటవరం గ్రామానికి చెందిన ఒకరు, రాజమండ్రికి చెందిన ఒకరు, కొంతమూరుకు చెందిన ఒకరు మద్యం సేవిస్తూ పేకాడుతుండగా పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3 వేల నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరపరుస్తామని సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు.

బంగారు ఆభరణాలు, నగదు చోరీ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక ఎస్‌సి కాలనీకి చెందిన గుడివాడ లోవకుమారి ఇంటిలోని బంగారు ఆభరణాలు, నగదు చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. శనివారం రాత్రి లోవకుమారి నిద్రించుచున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటిలోనికి ప్రవేశించి బీరువాలోని విలువైన బంగారు ఆభరణాలు, నగదు దొంగిలించారని, తెల్లవారుజామున నాలుగు గంటలకు నిద్ర నుంచి లేసేసరకి బీరువా తెరిచి ఉండడం చూడగా బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురియిందని వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెద్దాపురంలో చైన్ స్నాచింగ్

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వరహాలయ్యపేటకు చెందిన బొడ్డు రమణకుమారి శనివారం రాత్రి నువ్వుల గుంట వీధి మీదుగా తన ఇంటికి వెళుతుండగా మార్గ మధ్యలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మోటార్ బైక్ పై వచ్చి ఆమె మెడలో మూడు కాసుల బంగారు గొలుసు బలవంతంగా లాక్కుని వెళ్లిపోయారు. ఈ సంఘటన జరిగిన సమయంలో వీధిలైట్లు వెలగడం లేదని తెలిపారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు. దీనిపై ఎస్ఐ వి.మౌనిక కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరిపై పోలీసులు ఇద్దరిపై కేసు నమోదుచేశారు. బొబ్బర్లంక సెంటర్ వద్ద ఎస్ఐ ఎస్.రాము ఆదివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అధికంగా మద్యం తాగి వాహనం నడుపుతున్నారు. వారిపై అనుమానం రావడంతో వారికి బ్రీత్ ఎనలైజర్ పరికరంతో పరీక్షించారు. వారిద్దరూ అధికంగా మద్యం తాగినట్లు తేలడంతో వారిద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి కొత్తపేట కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెండి, బంగారం చోరీపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి మూడు కిలోల వెండి, ఒక కాసు బంగారం దొంగలించిన సంఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఆదివారం వారు తెలిపిన వివరాలు ఇవి.. తాడిపూడి గ్రామానికి చెందిన పెన్మత్స వెంకట కృష్ణంరాజు ఇటీవల కుటుంబ సభ్యులతో హైదరాబాద్ వెళ్లారు. తిరిగి శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చారు. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువా తలుపులు తెరచి ఉండడంతో అందులో ఉన్న మూడు కేజీల వెండి, కాసు బంగారం లేకపోవడంతో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించి ఉంటారని భావించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఎస్.రాము తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అమలాపురం నుంచి క్లూ టీమ్ వచ్చి వేలిముద్రలను సేకరించారు. దీనిపై బాధితుడు కష్ణంరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - కొత్తపేట

వాడపాలెం ఏటుగట్టు వద్ద ఉన్న పశువుల పాకలో ఆదివారం యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వాడపాలెం బండారు పేటకు చెందిన పంతాడి చిన్న (21) ఆదివారం ఎవరూ లేని సమయంలో పశువుల పాకలోని ఉరేసుకున్నాడు. పశువుల పాకయజమాని చూసి స్థానికులు తెలియపరచడంతో తండ్రి తాతారావు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ జి.సురేంద్ర సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రులు తరలించారు. పోస్ట్‌మాస్టర్ మృతదేహాన్ని అనంతరం బంధువులకు అప్పగించారు. దీనిపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

భార్యను చంపిన భర్త

ప్రజాశక్తి-రాజానగరం

భార్యను కిరాతకంగా రాయితో భర్త కొట్టి చంపిన సంఘటన రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో కొంతమూరులో చోటు చేసకుంది. సిఐ ప్రసన్న వీరయ్య గౌడ్ తెలిపిన వివరాలు. నర్సీపట్నం మండలం గిడుగుటూరు చెందిన వేమగిరి మాణిక్యానికి కొంతమూరుకు చెందిన ఉష(27)తో పదేళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి కుమారుడు కుమార్తె ఉన్నారు. భార్యాభర్తలు ఇద్దరూ తరుచూ గొడవ పడడంతో ఉష పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గ్రామంలో నివాసం ఉంటున్న తన తల్లిదండ్రుల ఇంటికి వచ్చి వెళుతూ ఉండేది. సోమవారం రాత్రి ఉషతో మాణిక్యం గొడవ పడ్డాడు. ఇది చూసి భయపడిన పిల్లలు అమ్మమ్మ ఇంటికి వెళ్లి చెప్పారు. వారు వచ్చేసరికి బలమైన రాయితో ఉష తల, ముఖంపై మాణిక్యం కొట్టడంతో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. హుటాహుటిన రాజమహేంద్రవరం ప్రభుతాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయింది. మతురాలు తల్లి నల్లమటి లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలవరం కాలువలో యువకుని మృతి

ప్రజాశక్తి- సీతానగరం

పోలవరం కాలువలోకి చేపలు పట్టుకోవడానికి వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దీపక్ సింగ్, పోలవరం ఎడమ కాలువ పనులు చేయడానికి వచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 24న మధ్యాహ్నం పోలవరం ఎడమ కాలువలో చేపలు వేటకు వెళ్లి దురదష్టవశాత్తు కాలువలో పడి గల్లంతయ్యాడు. ఆదివారం ఉదయం పోలవరం కాలువలో మతదేహం వెలుగు చూడడంతో పోలీసులకు కాంట్రాక్టర్ సమాచారం అందించారు. జితేష్ కుమార్ సింగ్ ఫిర్యాదు మేరకు సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుని అదృశ్యం

ప్రజాశక్తి - సీతానగరం

యువకుడు అదశ్యమైన సంఘటన సీతానగరంలో చోటు చేసుకుంది. వంగలపూడి గ్రామానికి చెందిన పల్లప్రోలు వెంకట దుర్గాప్రసాద్ డిగ్రీ చదువుకున్నాడు. ఉదయం చినకొండేపూడిలోని డిగ్రీ కళాశాలకు సర్టిఫికెట్ల నిమిత్తం అని ఇంట్లో చెప్పి వెళ్ళాడు. సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడు చిన్నాన్న పల్లప్రోలు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

పశ్చిమ బెంగాల్‌కు చెందిన యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి-రాజానగరం

పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన యువకుడు కొంతమూరులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నారాయణమ్మ తెలిపిన వివరాలివి. గ్రామంలోని మెటల్ ఇండస్ట్రీస్‌లో దివాకర్ కుమార్ (21) రెండు నెలలు నుంచి పని చేస్తున్నాడు. సహోద్యోగి ఆదివారం ఉదయం ఇండస్ట్రీ తెలుపు తీయగా షెడ్ పైకప్పుకు దివాకర్ ఉరేసుకుని ఉన్నాడు. ఇండస్ట్రీ యజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుని మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని వడ్లమూరు రోడ్డు సంత మార్కెట్ సమీపంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు. వృద్ధుని వయస్సు సుమారు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ మృతదేహానికి సంబంధించి వివరాలు తెలిసినవారు 9440904846, 9440904844 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

తీపర్రులో గుర్తు తెలీని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని తీపర్రులో ర్యాలి లక్ష్మణరావు పొలం వద్ద సుమారు 55 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు ఇతను పురుగుల మందు తాగి చనిపోయినట్టు తెలుస్తోంది. మృతుడు తెలుపు రంగు బనియన్, నీలం రంగు గళ్ల లుంగీ కట్టుకున్నాడు. సుమారు 5.2 అడుగుల ఎత్తు ఉన్నాడు. మృతదేహాన్ని తణుకు ఏరియా ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

లారీ, జీపు ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి-పెరవలి

ఎస్ఆర్‌కె రైస్ మిల్ సమీపంలో జాతీయ రహదారిపై రావులపాలెం నుంచి తణుకు వెళ్తున్న లారీ వెనుక వైపు వెళుతున్న జీపు ఢీకొట్టడంతో జీపులో ఉన్న కొమ్మోజు విశ్వేశ్వరరావు (58) అక్కడే మృతి చెందారు. జీపులో ముగ్గురు ఉన్నారు. వీరి స్వగ్రామం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం రాయలం గ్రామం. విశ్వేశ్వరావు మృతదేహాన్ని తణుకు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

29న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాలోని 36 అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. అనంతరం 6 అంశాల ఎజెండాపై కాంట్రాక్ట్ కమిటీ సమావేశం నిర్వహిస్తామన్నారు.

ఎంఎల్‌ఎను కలిసిన దేవస్థానం నూతన కమిటీ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

నల్లూరు గ్రామంలో రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం నూతన కమిటీ సభ్యులు మండపేట టిడిపి కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంధర్భంగా ఎంఎల్ఎ వేగుళ్లను వారంతా దుశ్శాలువాతో సత్కరించి, మొక్కను అందజేశారు. ఛైర్మన్‌గా గుణ్ణం రాంబాబు, మెంబర్లుగా గుండు మంగతాయారు, గుత్తుల మంగాయమ్మ, పెనుమర్తి అమరవాణి, మేడిశెట్టి దుర్గ, వెన్న బాబురావు, ఇసకపూడి రామలక్ష్మి, కురాటి నల్లబ్బాయి, పిల్లి వెంకటలక్ష్మిలు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, కపిలేశ్వరపురం మండల మాజీ అధ్యక్షులు ముత్యాల వెంకట్రావు, గ్రామశాక అధ్యక్షులు మేడిశెట్టి శ్రీనివాసు, పెనుమర్తి జగదీష్, గుడిమెట్ల చంద్రశేఖర్, నరాల త్రిమూర్తులు, కురాటి అన్నవరం, పెనుమర్తి రాజుబాబు, దొమ్మేటి శ్రీనివాసు, మాచవరపు విజయకుమారి, పల్లి ఏడుకొండలు, తదితరులు, పాల్గొన్నారు.

అన్నాయిపేటలో రక్షిత మంచినీటి పథకం ప్రారంభం

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని అన్నాయిపేట గ్రామంలో కాకినాడ రోటరీ క్లబ్ సౌజన్యంతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమానికి రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, రోటరీ అధ్యక్షులు తడాలబుజ్జి, రోటరీ సెక్రెటరీ సతీష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంరెడ్డి దొరబాబు మాట్లాడుతూ ప్రజలందరికీ రక్షిత మంచినీరు అందించేందుకు రోటరీ క్లబ్ చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరూ ఈ మంచినీటి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం, వైస్ ఎంపిపి శాఖ బాబి , ఉప సర్పంచ్ చల్ల బుజ్జి, రావూరి సుబ్బారావు, పెమ్మిరెడ్డి మురళి, ఆకేటి భీమన్న, పాలక సభ్యులు రోటరీ క్లబ్ కాకినాడ పాలక సభ్యులు, అన్నయ్య పేట గ్రామ ప్రజలు పాల్గొన్నారు . ఈ కార్యక్రమం అనంతరం రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు.

రామచంద్ర యాదవ్‌ను అడ్డుకోవడం అప్రజాస్వామికం

ప్రజాశక్తి - రామచంద్రపురం

భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్‌ను నెల్లూరు జిల్లాలో పర్యటించకుండా పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికం అని ఆ పార్టీ రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రీనివాస్ యాదవ్ ఖండించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు..ారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. వ్యక్తుల స్వేచ్ఛ స్వతంత్రాలకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజా పోరాటాలు ఎవరు ఆపలేరని, ప్రజల సమస్యలు ఉన్నంతకాలం పోరాటాల కొనసాగుతూనే ఉంటాయని ఆయన వివరించారు. స్థానికంగా ఉద్యమాలు అడ్డుకుంటే రాష్ట్రస్థాయి ఉద్యమాలు మొదలవుతాయని ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు.

సమాజంలో మార్పునకు కృషి చేయాలి

ప్రజాశక్తి - మండపేట

అసమానతలతో సతమతమవుతున్న నేటి సమాజాన్ని మార్చేందుకై ప్రతి ఒక్కరూ కృషి మండపేట లో ఆదివారం నిర్వహించిన విద్యార్థి, యువజన సదస్సులో పాల్గొన్న వక్తలు అన్నారు. ప్రముఖ హో మియో వైద్యుడు డా. చల్లా వెంకట్రావు 17 వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 80 మంది విద్యార్థి, యువకులు హాజరయ్యారు. నేటి సమాజంలో విద్య, ఉపాధి, సంస్కతిక, సంప్రదాలని విశ్లేషిస్తూ మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా మానవ జీవన పరిస్థితులు సైతం మారుతుంటాయన్నారు. వాటిని విశ్లేషించుకుంటూ ముందుకు సాగాలన్నారు. సంగమం సాంస్కృతిక వేదిక నిర్వాహకులు డాక్టర్ చల్లా రవికుమార్, డాక్టర్ మెహెర్ ప్రసన్న, విద్యావేత్త వల్లూరి సత్యనారాయణ చౌదరి, రిటైర్డ్ ఆంగ్ల అధ్యాపకుడు కట్టా కృష్ణారావు, సామాజికవేత్త గౌరవ్ మాట్లాడుతూ నేటి విద్యార్థి, యువకులు సామాజిక బాధ్యతతో మెలగ గలరన్న నమ్మకం నేటి సదస్సులో విద్యార్థుల ప్రసంగాలు ద్వారా కలిగిందన్నారు. తొలుత డాక్టర్ చల్లా వెంకట్రావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రముఖులు మాట్లాడుతూ చల్లా వెంకట్రావు తన జీవితకాలాన్ని సమాజ ఉన్నతికోసం కేటాయించారాని, ఆయన బాటలో ప్రతీ ఒక్కరూ పయనించాలన్నారు. కార్యక్రమంలో పలు రంగాల నాయకులు పి సురేంద్ర, బి.రాజేంద్ర, జి. స్వామి ప్రసాద్, యు.గుణ, డివి.రాఘవులు, టి.రాజా, యు.గోపాల్, ఎన్.సూర్యనారాయణ, జి.సుధాకర్, ఎన్ అజయ్, టి.వసంతరావు, తదితరులు, పాల్గొన్నారు.

బొబ్బర్లంక బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

బొబ్బర్లంక బ్యారేజీ వద్ద ఆదివారం గోదావరి ఉధృతంగా ప్రవహించింది. గోదావరి, ఉపనదులు పొంగి ప్రవహించడంతో నిన్నటి వరకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతూ వచ్చింది. అయితే ఆదివారం సాయంత్రం 6 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 10.90 అడుగులు నీటిమట్టం నమోదయింది. 6 లక్షల 18 వేల 44 క్యూసిక్కుల నీటిని బ్యారేజీ దిగువకు సముద్రంలోకి వదిలారు.

కూటమి ప్రభుత్వం హామీల అమలు చేయకపోవడంపై నిరసన

ప్రజాశక్తి - అయినవిల్లి

అయినవిల్లి మండలంలోని కె.జగన్నాథపురంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం వైసిపి మండల అధ్యక్షులు మేడిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి పి గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అంటేనే చంద్రబాబు నాయుడు అని, నాడు మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా , నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఈ విషయంపై గ్రామల్లో పర్యటించి ప్రతి ఒక్క ప్రజలకు తెలియజేసి బాబు ద్వంద వైఖరిని ఎండగట్టాలని తెలియజేశారు ఈ సందర్భంగా కె.జగన్నాథపురం అధ్వాన్నంగా ఉన్న రోడ్డులోని గోతుల్లో నాట్లు వేసి నిరసన తెలిపారు అనంతరం నినాదాలు చేస్తూ మ్యానిఫెస్టోలో ఉన్న అంశాలను గుర్తుచేసి తక్షణమే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ పాముల రాజేశ్వరీ దేవి, జిల్లా ఉపాధ్యక్షులు కుడుపూడి విద్యాసాగర్, ఎంపిపి మట్టపర్తి నాగ విజయలక్ష్మి, నాలుగు మండలాల అధ్యక్షులు వివిధ గ్రామాల సర్పంచులు ఎంపిటిసి సభ్యులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఏరుపల్లి గ్రామ సర్పంచ్ శ్రీధర్ మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

శ్రీధర్ (ఫైల్)

మండలంలోని ఏరుపల్లి గ్రామ సర్పంచ్ డాక్టర్ మల్లి మొగ్గల శ్రీధర్ (71) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన ఏరుపల్లి గ్రామ సర్పంచ్ గా వైసిపి నాయకులుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పంచాయతీ విభాగం (వైసిపి) అధ్యక్షుడిగా కూడా పదవిలో ఉన్నారు. ఈయనకి భార్య, కూమార్తె, అల్లుడు ఉన్నారు. ఈయన మృతి పట్ల రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్,. నియోజకవర్గం కోఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాష్, జడ్‌పిటిసి సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపిపి అంబటి భవాని, వైస్ ఎంపిపి నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబి, ఎంపిడిఒ కడలి పద్మజ్యోతి, రాష్ట్ర ఆర్ఎంపీ వైద్యుల సంఘం అధ్యక్షులు సభ్యుడు చప్పిడి వెంకటేశ్వరరావు , కార్యదర్శి గునుపే శోభన్ బాబు, రామచంద్రపురం డివిజన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్.వి. కష్ణారావు తదితరులు సంతాపం తెలిపారు.

భవిష్యత్తుకు క్వాంటం టెక్నాలజీ ఆధారం

ప్రజాశక్తి - రాజోలు

భవిష్యత్తు తరాల శాస్త్ర సాంకేతిక రంగాలు అన్నీ క్వాంటం టెక్నాలజీ పైనే ఆధారపడి ఉంటాయని స్థానిక ఎంవిఎన్., జెఎస్, ఆర్‌విఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ విజయ్ సత్య ప్రసాద్ యర్రంశెట్టి అన్నారు. ఈ పరిణామాలపై నేటి విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో పరిశోధన పత్రాలను రూపొందించారు. ఒకే నెలలో అయన రూపకల్పన చేసిన అయిదు పరిశోధన పత్రాలు ఆయా అంతర్జాతీయ జర్నల్లలో ప్రచురితం అయ్యాయని ఆయన ఆదివారం తెలియజేశారు క్వాంటం టెక్నాలజీపై రెండు, ఎలక్ట్రానిక్స్ లో ఒకటి, ఫిజిక్స్ పై ఒకటి, సైకాలజీ విభాగంలో ఒకటి మొత్తం 5 పరిశోధన పత్రాలు ఒక్క జూలై నెలలోనే ప్రచురితం కావడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల కరెస్పాండంట్ మంగెన సత్యనారాయణమూర్తి, ప్రిన్సిపల్ ఎన్.ఆనంద మహని, ఐక్యూఎసి కో ఆర్డినేటర్ పిఎస్ఎన్.రాజు, సీనియర్ అధ్యాపకులు చిట్టాల సత్యనారాయణ, పిడికె.ప్రసాద్, అడ్డాల మణికంఠ అభినందించారు.

పరదేశమ్మకు గరగ బహూకరణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

గ్రామ దేవత పరదేశమ్మతల్లికి స్థానిక కొండిశెట్టి ఈశ్వరరావు, పార్వతీ దంపతులు ఆదివారం గరగను బహుకరించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు గృహం నుంచి తాళ్ళరేవు మెయిన్ రోడ్డు, మార్కెట్ మీదుగా ఆలయం వరకూ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పులు, మేళతాళాలతో నిర్వహించిన, గరగ నృత్యాలు అలరించాయి. అనంతరం ఈశ్వరరావు ఇంటి వద్ద అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ఈశ్వరరావు కుటుంబ సభ్యులు మహేంద్రనాయుడు, సూర్య లక్ష్మీ ప్రసన్న, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బంగ్లా తోటలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రాపురం పట్టణంలోని సువర్తపేట , బంగ్లాతోట వార్డుల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జిల్లా యువజన విభాగ అధ్యక్షులు పిల్లి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ ఎన్నికలముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని ప్రజలకు గుర్తు చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం యొక్క వైఫల్యాలను, మోసపూరిత హామీలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమం లో వైసిని పట్టణ అధ్యక్షులు గాదంశెట్టి శ్రీధర్, కౌన్సిలర్స్, అధికార ప్రతినిధులు, అనుబంధ విభాగ అధ్యక్షులు, వార్డు సీనియర్ నాయకులు, పారీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE II JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 6029 of 2023

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law) & Authorized Officer, ...Plaintiff

And

Sri.D.Yohan ...Defendant

To
Sri.D.Yohan, S/o.Ammadu, Aged about 46 Years, Occ: Business, R/o. H.No.9-1-46, Lawyers Street Peddapuram, East Godavari Dist., Andhra Pradesh-533437.
Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.1,87,056-43ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 22-08-2025.
In case of your failure to attend before the Court on 22-08-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.
(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, **HYDERABAD-50.**

IN THE COURT OF THE II JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 2118 of 2022

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.byits Sr.Manager(Law) & Authorized Officer, ...Plaintiff

And

Sri.Nageswara Rao.V ...Defendant

To
Sri.Nageswara Rao.V, S/o. Venkateswara Rao, Aged about 52 Years, Occ: Business, R/o. H.No.3-173, Indrapalem, Lakulast, Kakinada Rural, A.P-533006.
Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.1,36,251-21ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 22-08-2025.
In case of your failure to attend before the Court on 22-08-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.
(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, **HYDERABAD-50.**

IN THE COURT OF THE VI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 3167 of 2024

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law) & Authorized Officer, ...Plaintiff

And

Sri.K.Satyanarayana ...Defendant

To
Sri.K.Satyanarayana, S/o. Nookayya, Aged about 66 Years, Occ: Employee, R/o. D.No 48-21-1/4, Goleelapeta, Near Lions Club, Jagannaikpur, Kakinada, A.P-533002.
Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.5,85,833-10ps_to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 28-08-2025.
In case of your failure to attend before the Court on 28-08-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.
(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, **HYDERABAD-50.**